'కోడ్' పక్కాగా అమలు!

- ఉల్లంఘనలపై ప్రత్యేక నజర్
- చెక్ పోస్టుల ఏర్పాటు
- ముమ్మరంగా వాహన తనిఖీలు



వాల్‌పోస్టర్లను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఎల్‌బీనగర్: ఎన్నికల కోడ్ కూయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు, సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు ఎక్కడక్కడ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వచ్చే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎల్‌బీనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పంకజ ఆదేశాలతో సహాయ ఎన్నికల అధికారులు తమ విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ప్రచారాలు, ప్రభావితం చేసే నాయకుల విగ్రహాలపై దృష్టి సారించారు. పార్టీ జెండాల దిమ్మెలకు, విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు వాల్ పోస్టర్లను తొలగించారు. అంతే కాకుండా పోలీసులు నగదు, మద్యం అక్రమ రవాణాకు పాల్పడేవారిపై నిఘా పెట్టారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లతోపాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. కోడ్ కూసిన రోజునే ఎల్‌బీనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీల్లో భారీగా నగదు పట్టుకున్నారు.

పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు తొలగింపు...

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచే అధికారులు ఆయా డివిజన్లలో పర్యటించి ఎక్కడ పార్టీల జెండాలు ఉన్నా తొలగిస్తున్నారు. పార్కుల గోడలపై ఉన్న పెయింటింగ్‌లు, బ్రిడ్జీలు, బస్టాండ్లు, డివైడర్లపై ఉన్న రాతలపై తెల్ల రంగు వేసి కనపడకుండా చేస్తున్నారు. ఇప్పటికే బస్టాండ్‌ల వద్ద ఉన్న వాల్ పోస్టర్లు తొలగించారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వనస్థలిపురంలో వాహనాల తనిఖీలు

హస్తినాపురం: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అక్రమంగా మద్యం, డబ్బు తరలింపును అడ్డుకొనేందుకు వనస్థలిపురం పోలీసులు రంగంలోకి దిగారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం సీఐ జలేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీ చేపట్టారు. వనస్థలిపురం రైతు బజార్ ప్రాంతంతో పాటు వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారి, నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. ఎస్‌ఐలు జగన్, మాధవరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు : ఈఆర్‌ఓ జయంత్

చాదర్‌ఘాట్: దివ్యాంగ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని మలక్‌పేట నియోజకవర్గ ఈఆర్‌ఓ జయంత్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలో దివ్యాంగ ఓటర్లు 1078 మంది ఉన్నారని, అందులో పురుషులు 634, మహిళలు 438 మంది అని చెప్పారు. వారి కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించే విధంగా కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లుకు అన్ని సౌకర్యాలు అందుబాటులోఉంచుతామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆర్‌ఓకు లేదా, ఈఆర్‌ఓకు ఫిర్యాదులు చేయాలని సూచించారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు ఊపిరి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి ఊపిరి అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్యాలెస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ బూత్ స్థాయి పార్టీ క్రియాశీల కార్యకర్తల సమవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... పార్టీ కార్యకర్తలు 40 రోజుల పాటు విరామం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు అభివృద్ధిలో ఎల్‌బీనగర్ శరవేగంగా దూసుకెళ్తున్న విషయాన్ని గడప గడపకూ తెలియజేసి తన విజయానికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దయానంద్, పార్టీ నాయకులు దేవిరెడ్డి రణధీర్‌రెడ్డి, నల్లా రఘుమారెడ్డి, వెంకటేశంగౌడ్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణమాచారి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

రాష్ట్ర అభివృద్ధి ప్రదాత కేసీఆర్..

రాష్ట్రాన్ని అన్ని రంగాలల్లో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అందువల్లే మరోమారు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే అధికార పగ్గాలు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి చంపాపేటలోని లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ సంఘ నేతలు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, బాలకృష్ణ, నరసింహ, గోపాల్‌ముదిరాజ్, నరేష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, అమరేందర్, సాగర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ భవన నిర్మాణాన్ని అడ్డుకోండి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ చైతన్యనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ యజమాని రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని చైతన్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డిలు ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ రవీందర్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. రాత్రికి రాత్రే కాలనీకి చెందిన గోడను ఆగ్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, తాము అడిగితే తమకు అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతున్నాడని వారు పేర్కొన్నారు. కాలనీకి వెళ్లే రహదారిని ఆక్రమిస్తే రోడ్డు కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు. గతంలో ఇక్కడ అక్రమంగా భవనాన్ని నిర్మిస్తే జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారని, తిరిగి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డీసీని విజ్ఞప్తి చేశారు.

ఆర్థరైటిస్‌తో వెన్నెముక రుగ్మత

- కామినేని హాస్పిటల్స్ వైద్యుడు డాక్టర్ పీఎస్ జయప్రసాద్



మన్సూరాబాద్: ఆర్థరైటిస్ వెన్నెముఖ రుగ్మతలకు దారి తీస్తుందని, యువకుల్లో వైకల్యానికి ప్రధాన కారణాల్లో వెన్ను నొప్పి ఒకటని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ సీనియర్ ఆర్థోస్కోపీ, జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ పీఎస్ జయప్రసాద్ అన్నారు. ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం 12న నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాను 70కోట్ల మంది ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్నారని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పాటిస్తున్నట్లు వెల్లడించారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్థియో ఆర్థరైటిస్‌ల నివారణకు ఎలాంటి చికిత్స లేదని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం ఒక్కటే మార్గమన్నారు.

కుంగిన రోడ్డు.. రాకపోకలకు ఇక్కట్లు



చైతన్యపురి: కొత్తపేట చౌరస్తా నుంచి దిల్‌సుఖ్ నగర్ వెళ్లే జాతీయ రహదారి చైతన్యపురి జంక్షన్ వద్ద రోడ్డు కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. బుధవారం ఉదయం రోడ్డు మధ్యలో రెండు అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల లోతులో గుంత పడింది. ఇది గమనించి బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతంలో గొయ్యి ఏర్పడటంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా13, వంకాయ 28-45, బెండ 28, పచ్చి మిర్చి 35, కాకర 35, బీర 23, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 70, క్యారెట్ 33, దొండ 28-35, చిక్కుడు 35-65, గోకర 28, బీట్‌రూట్ 15, క్యాప్సికం 55, ఆలు 21, దోస 15, సార 13, పొట్ల 13, ఉల్లిగడ్డ 26, చామగడ్డ 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

అఖిల భారత యాదవ మహాసభ



సీఎంకు రాసిన లేఖను చూపిస్తున్న మహేందర్ యాదవ్

సైదాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. సైదాబాద్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ, బోనాల పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటున్నామని, అదేవిధంగా సదర్‌కు కూడా గుర్తింపు ఇవ్వాలన్నారు. గతేడాది మన్నెగూడలో నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళన సభలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ సదర్ వేడుకలను సైతం అధికారికంగా నిర్వహించుకుందామని ప్రకటించారని గుర్తు చేశారు. సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు శ్రీశైలం, బత్తుల మహేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

13న పొదుపు సంఘాల మహిళా చైతన్య సదస్సు

కాచిగూడ: అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఈ నెల 13న పొదుపు సంఘాల 'మహిళా చైతన్య సదస్సు' ను నిర్వహిస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. బుధవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో మహిళా ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మహిళలను అభివృద్ధిలో భాగస్వామ్యం, మహిళల సమస్యల పరిష్కారానికి ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 20న అంబర్‌పేట మున్సిపల్‌గ్రౌండ్‌లో నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు. బీజేపీ అంబర్‌పేట కన్వీనర్ శ్యామ్‌రాజ్, ఆర్తీ, జ్యోతి, విజయ, అనురాధ, రమ్య, స్వప్న, వరలక్ష్మి, సునంద, సావిత్రి, సరోజనమ్మ పాల్గొన్నారు.

నిన్ను నువ్వే బాగు చేసుకోవాలి

- ఉమెన్ సేఫ్టీవింగ్ డీఐజీ సుమతి



బడంగ్‌పేట్: నిన్ను నువ్వే బాగుచేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ బడుగుల సుమతి సూచించారు. బుధవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐపీఎస్ అధికారి సుమతి హాజరై మాట్లాడారు. నీ భవితను నీవే నిర్ణయించుకొని బాగుచేసుకోవాలన్నారు. మొబైల్ వాడటం ఎలా కంట్రోల్ చేయాలి? ఆన్‌లైన్ సైట్‌లో మోసపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థినులకు వివరించారు. దురాలవాట్లకు ఎలా దూరంగా ఉండాలో, ఉద్యోగాలు చేస్తున్నప్పుడు వచ్చే సమస్యలను ఎలా అధిగమించాలో పవర్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మానసిక బలం, నిజాయితీలను ఆయుధంగా వాడాలన్నారు. అవసరమైనప్పుడు కమ్యూనికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా వాడాలని హితవు పలికారు. ఉమెన్ సేఫ్టీ ఇంటర్న్‌షిప్‌లకు పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన కొన్ని రహస్య మెలుకువలు తెలియజేశారు. సుమతిని కాలేజీ యాజమాన్యం జ్ఞాపిక సన్మానించారు. స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీ సెక్రటరీ ఎస్.జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ పి.వెంకటకృష్ణ, గాయత్రి పావని, ఆధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: వాషింగ్ మిషీన్ బింగిచేందుకు వచ్చి బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పట్టాబి రామారావు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ కె.రాజిరెడ్డి కథనం ప్రకారం... మియాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌లో వాషింగ్ మిషీన్ బింగించేందుకు నిందితుడు షేక్ మౌలాలి వచ్చాడు. ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో అదే ఫ్లాట్‌కు ఆడుకునేందుకు వచ్చిన పక్క బ్లాక్‌కు చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. అదే సమయంలో ఫ్లాట్ యజమానురాలు రావడంతో బాలికను వదిలి పెట్టాడు. బాలిక విషయాన్ని తల్లికి చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు 2019లో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి బుధవారం నిందితుడికి మూడేళ్ల జైలు, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

జీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

బీసీ కులాల సమన్వయ వేదిక డిమాండ్

వనస్థలిపురం: అన్ని పార్టీలు అగ్రకులాలకే అధిక సీట్లు ఇస్తున్నాయని, 60 శాతం జనాభా ఉన్న బీసీలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని బీసీ కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వనస్థలిపురం కర్నాటి గార్డెన్‌లో తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అన్ని పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, బీసీలు రాజ్యాధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. 156 బీసీ కులాలు సంఘటితం కావాలన్నారు. ఎల్‌బీనగర్ గడ్డ- బీసీల అడ్డా అని, ఏ పార్టీ బీసీలకు టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామన్నారు. శ్రీకాంతాచారి బలిదానం వల్లే తెలంగాణ కల సాకారమైందని, బీఆర్ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మధుయాష్కి గౌడ్‌కు టికెట్ ఇస్తే మద్దతిస్తామని, బీజేపీ నుంచి కటకం నర్సింగరావుకు టికెట్ ఇవ్వాలని వారు కోరారు. ఏ పార్టీ బీసీలకు టికెట్ ఇవ్వకపోతే బీసీ కులాల సమన్వయ వేదిక నుంచి అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. బొమ్మ రఘురాం నేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కొలే జగన్నాథం, చామకూర రాజు, బొంగు వెంకటేష్, వినోద్‌కుమార్, మహేష్‌గౌడ్, కారింగుల నరేందర్‌గౌడ్, ముద్దగాని సతీష్ గౌడ్, సావిత్రి, శ్రీనివాస్, నర్సింగ్, విజయ్‌కుమార్, యాదగిరి నేత, నగేష్ నేత పాల్గొన్నారు.

ఏళ్ల నిరీక్షణ.. నేడు ఆనందం



రెసిడెన్షియల్ జోన్‌గా మార్చివేసిన జీఓను చూపెడుతున్న కాలనీవాసులు

- ఓపెన్, గ్రీన్ జోన్ల ఎత్తివేత
- కాలనీల్లో సంబురాలు
- మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు, క్షీరాభిషేకాలు

బడంగ్‌పేట్: 20 ఏళ్ల నిరీక్షణ.. నేడు ఫలించింది.. ఎవరో చేసిన చిన్న తప్పిదాలకు వేలాది కుటుంబాలు సమస్యల్లో చిక్కుకున్నారు. ఇళ్లు కట్టుకోవడానికి పర్మిషన్లు ఇవ్వకుండా కడుతున్న ఇండ్లను నేలమట్టం చేయడం, లక్షలు పోసి కొనుకున్న స్థలం దేనికి పనికిరాకుండా పోయిందని కొనుగోలుదారుల మానసిక ఆవేదన.. వెరసి ఓపెన్, గ్రీన్‌జోన్ల నుంచి రెసిడెన్షియల్ జోన్లుగా మార్పులు చేసి జీఓ విడుదల చేయడంతో 20 పైగా కాలనీల్లో ఆనందాలు వెల్లువిరుస్తున్నాయి. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 148,149లోని సర్వేనంబర్లలో 27 ఎకరాల్లో నివాసాలు ఏర్పరుచుకున్న వారు అలాగే అల్మాస్‌గూడలోని 121, 122, 123, 124, 129 సర్వే నంబర్లలోని 52 ఎకరాలు మొత్తంగా 80 ఎకరాల్లో గతంలో లేఅవుట్ చేసి వెంచర్లు నిర్వహించారు. 1982లో హెచ్‌ఎండీఏ ఏర్పడినప్పుడు ఈ ప్రైవేట్ భూములను ఓపెన్, గ్రీన్ జోన్ కింద చేర్చారు. అప్పటి నుంచి కాలనీవాసులు కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగి వేసారి పోయారు. అసెంబ్లీ తీర్మానం చేస్తే తప్పా వేరే మార్గం లేదని, ఫిర్యాదులను స్వీకరించలేదని బాధితులు చెప్పుకొచ్చారు. ఓపెన్‌జోన్ ఎత్తివేయిస్తానని మంత్రి సబితారెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చినా మాట ప్రకారం ఓపెన్, గ్రీన్ జోన్‌ను ఎత్తివేసి, రెసిడెన్షియల్ జోన్‌గా మార్చుచేశారు. దీంతో గ్రీన్ జోన్, ఓపెన్ జోన్‌ల్లో ఇళ్లు కట్టుకున్న వారు సంబరాలు చేసుకుంటున్నారు. అల్మాస్‌గూడలో సుమారు 12కు పైగా కాలనీలు, బడంగ్‌పేటలోని 9కి పైగా కాలనీలు ఆనందంలో మునిగితేలుతున్నారు.

భార్యను వేధించిన భర్తకు ఏడాది కారాగారం

రంగారెడ్డి కోర్టులు: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1500ల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 3వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ కొత్త రవి బుధవారం తీర్పు ఇచ్చారు. ఏపీపీ జె.గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. 2020 మార్చి నెలలో నిందితుడు భాస్కర్ రెడ్డికి బాధితురాలితో పెళ్లైంది. ఏడాది పాటు వారి వైవాహిక జీవితం సాఫీగా సాగింది. ఆ తర్వాత ప్రతీ చిన్న విషయానికి భర్త భార్యతో గొడవపడటంతో పాటు అదనపు కట్నం కోసం వేధించేవాడు. వేధింపులు తాళలేక బాధితురాలు 2022 అక్టోబర్‌లో సరూర్‌నగర్ మహిళా పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. సాక్షులను విచారించిన మేజిస్ట్రేట్ నిందితుడు భాస్కర్ రెడ్డికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తుది తీర్పు వెల్లడించారు.

రౌడీషీటర్లపై నిఘా



చాదర్‌ఘాట్: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావటంతో ఎలాంటి ఘటనలు జరగకుండా చాదర్‌ఘాట్ పోలీసులు ఓల్డ్‌మలక్‌పేటలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దాడుల్లో పత్రాలు సరిగా లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ మనోహర్ మాట్లాడుతూ, స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లపై నిఘా పెంచామని, వారంలో ఒక రోజు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తామని తెలిపారు. సమస్యాత్మక కాలనీల్లోని ప్రతి ఇంటినీ తనిఖీ చేస్తామన్నారు. ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి, వంద మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

- సైబర్ క్రైమ్స్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఫిర్యాదు

సైదాబాద్: సోషల్ మీడియాలో తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పోలీసులను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం సైబర్ క్రైమ్స్ విభాగంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ, మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యాసంస్థల కార్యదర్శిగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనపై కొందరు వ్యక్తులు వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాలలో తప్పుడు ఆరోపణలు చేస్తూ సమాజంలో తన పరువు తీయదానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సైదాబాద్‌లోని ఆలయ నిర్మాణాన్ని తాను అడ్డుకున్నట్లు అసత్యపు ఆడియోలు, వీడియోలను కావాలని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న వారి సెల్ నెంబర్లు, సోషల్ మీడియా అకౌంట్ వివరాలతో సహా సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు చేశానని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు.

గంజాయి, మద్యం పట్టివేత

హయత్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ పోలీసులు నగరం మీదుగా కర్ణాటకకు ట్రావెల్స్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని, మద్యాన్ని పట్టుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ కథనం ప్రకారం.. ఏపీకి చెందిన మాలేపు అజిత్‌కుమార్, రోమియో మార్క్ రోడ్రిగస్ పాడేరు, నర్సీపట్నం ప్రాంతాల నుంచి గంజాయిని కిలో సుమారు రూ.6 వేలకు కొని కర్ణాటకలోని దావనగేరిలో రూ.25 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 8.3 కిలోల గంజాయి, పన్ను చెల్లించని 9 మద్యం బాటిళ్లను ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్టు సమీపంలోని ఫిలింసిటీ వద్ద తనిఖీ చేపట్టారు. బస్సులో 8.3 కిలోల గంజాయి, 9 మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వాటిని తరలిస్తున్న అజిత్‌కుమార్, మార్క్ రోడ్రిగస్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. తనిఖీల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్‌కుమార్, సీఐలు శ్రీనివాస్, సుభాష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నిందితులను చూపిస్తున్న పోలీసులు

భర్త మందలించాడని.. ఆత్మహత్య

నాగోలు: బయటకు వెళ్లి ఆలస్యంగా ఇంటికి వచ్చిన భార్యను భర్త మందలించడంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్, సింగరేణి కాలనీ చెందిన రేఖ కూతురు మనీషా(23)ను ఐదేళ్ల క్రితం తట్టిఅన్నారం ఆర్‌కే నగర్ ఆదివాసీ కాలనీ చెందిన శక్తి దీపక్‌కు ఇచ్చి వివాహం చేశారు. మంగళవారం సాయంత్రం మనీషా పనిపై బయటకు వెళ్లి రాత్రి ఆలస్యంగా ఇంటికి తిరిగి వచ్చింది. ఎందుకు ఆలస్యంగా వచ్చావని భర్త ఆమెను మందలించాడు. భర్త తనను అనుమానిస్తున్నాడని భావించిన మనీషా వంటగదిలోకి వెళ్లి ఇనుప రాడ్‌కు చున్నీతో ఉరేసుకుంది. ఇంటి ఇరుగు పొరుగు వారు వచ్చి కిందకు దింపారు. అప్పటికే మృతి చెందింది. తన కూతురు మానసికంగా ఇబ్బందులు పడుతోందని, ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకుందని మనీషా తల్లి నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ కాజేయడం సిగ్గుచేటు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం: సామ

మన్సూరాబాద్: నిరుపేదల కోసం తీసుకొచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాజేయడం సిగ్గుచేటని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. చంద్రపురికాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే తన అత్తామామలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు అర్హులు కానప్పటికీ అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్‌పై ఒత్తిడి తెచ్చి ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని ఇప్పించి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించి రూ.19 లక్షలు మంజూరు చేయించాడన్నారు. పేదలకు, తెల్లరేషన్‌కార్డు దారులకు సీఎం సహాయనిధి నుంచి వైద్యానికి నిధులు మంజూరు చేస్తారని, నిత్యం రోల్స్ రాయిస్ కారులో తిరిగే ఎమ్మెల్యే అత్తామామలకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు మంజూరు కావడం ఏమిటని ప్రశ్నించారు. తన సొంత బావమరిదికి చెందిన కొత్తపేటలోని ఓమ్ని ఆసుపత్రిలో అత్తామామలు చికిత్స పొందినట్లు సృష్టించి నిధులు కాజేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఏసీబీతో విచారణ చేయించాలని, హాస్పిటల్ లైసెన్స్‌ను రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చిన తహసీల్దార్‌పై విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలన్నారు. సుధీర్‌రెడ్డి హుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు సినీ తారల కోసం మూవీ టవర్స్ పేరుతో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం లే అవుట్ చేసిందని, అందులో సుమారు 10 ప్లాట్లను తన కుటుంబసభ్యులకు కేటాయించుకున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అవినీతి కుంభకోణాలపై ఆధారాలతో సహా రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తానని రంగారెడ్డి వెల్లడించారు. సమావేశంలో కార్పొరేటర్లు బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, గంగదాసు కృష్ణారెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9505507616 9912220363 9912220365